


www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

శనివారం | 19 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 08


# గణపతికి బండి పూజలు

### అశోక్ నగర్ వినాయకుడుని దర్శించుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్

### ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్రమంత్రి , మేయర్, డిప్యూటీ మేయర్



కరీంనగర్, అక్షిత బ్యూరో : గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కరీంనగర్ పట్టణం అశోక్ నగర్ వినాయక మండపాన్ని శుక్రవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర, దేశ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో ..మిగతా 2లో

# ప్రవేశాలు... ప్రమాణాలే లక్ష్యం

### ప్రభుత్వ కళాశాలల్లో విద్యా ప్రమాణాలపై కలెక్టర్ ఫోకస్

### విద్యార్థుల ప్రవేశాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ..


### బోధనలో వినూత్న పద్ధతులు అవలంబించాలని ఆదేశం



జనగామ, అక్షిత బ్యూరో : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత పెంచడంతో పాటు విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని, ప్రతి విద్యార్థి విద్యా పురోగతిపై అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ..మిగతా 2లో




# మీ 'సేవలకు' ఇంకెన్నాళ్ళు??



### కొత్త మీ సేవలకు మోక్షం ఎప్పుడో?

### నోటిఫికేషన్ ఇచ్చి 10 నెలలు

### పరీక్ష, ఇంటర్వ్యూలు పూర్తయినా కేటాయింపులు నిల్!

### మెరిట్ పక్కన పెట్టి అందరికీ ఇంటర్వ్యూలా?

### ఎంపిక ప్రక్రియపై ఆశావహుల అనుమానాలు

**భూపాలపల్లి,అక్షిత ప్రతినిధి :** పది నెలలు గడిచింది. 10 కొత్త మీ సేవా కేంద్రాలకు ఎంపిక ప్రక్రియ ఆరంభించారు. భూపాలపల్లి జిల్లాలో కొత్త మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇచ్చారు. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పరీక్ష నిర్వహించారు. ఇంటర్వ్యూలు కూడా తీసుకున్నారు. కానీ ఇంతవరకు కొత్త మీ సేవా కేంద్రాల కేటాయింపులపై మాత్రం స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా ..మిగతా 2లో



# నిమజ్జనానికి కృత్రిమ బేబీ కుంటలు

### కృత్రిమ బేబీ కుంటల ఏర్పాటును పరిశీలించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లాలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా పలు ప్రాంతాల్లో చెరువులు, కుంటల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో చిన్న, మధ్యతరహా వినాయక విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యామ్నాయంగా కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఐదు అడుగుల ఎత్తు వరకు ఉన్న వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం అప్పనపల్లి సమీపంలోని మయూరి పార్క్ ఎదురుగా గంగోస్కుంట వద్ద రెండు పెద్ద కృత్రిమ బేబీ కుంటలను, అలాగే పంచవటి స్కూల్ సమీపంలోని పార్కు స్థలంలో కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేశారు. అప్పనపల్లిలో గంగోస్కుంట వద్ద ఏర్పాటు చేసిన కృత్రిమ బేబీ కుంటలను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం ..మిగతా 2లో



## గణపతికి బండి పూజలు



**మొదటి పేజీ తరువాయి...**
పాటు కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై.సునీల్ రావు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక డివిజన్ కార్పొరేటర్ గొట్టేముక్కుల ఉమారాణి వెంకటరమణ వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు కేంద్ర మంత్రి బండి సంజయ్, మేయర్, డిప్యూటీ మేయర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. నగరంలో వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, వైభవంగా జరిగేలా నిర్వాహకులు తీసుకుంటున్న ఏర్పాట్లను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, వినాయక కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ప్రవేశాలు... ప్రమాణాలే లక్ష్యం



**మొదటి పేజీ తరువాయి...**
సూచించారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఇంటర్మీడియట్ విద్యపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు, హాజరు, విద్యా ప్రమాణాలు, కొనసాగుతున్న కోర్సులు, వృత్తి విద్యా కోర్సులు, విద్యార్థుల మధ్యలో చదువు మానివేత తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.

**901 మంది విద్యార్థుల చేరిక**

2026--27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇప్పటివరకు 901 మంది విద్యార్థులు చేరినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జితేందర్ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో విద్యార్థుల నమోదు, ప్రస్తుతం కళాశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య, చదువు మధ్యలో నిలిపివేసిన విద్యార్థుల వివరాలను సమీక్షించారు.జిల్లాలో ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు,

12 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ రంగంలో మొత్తం 38 కళాశాలలు ఉండగా, వాటిలో 12 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, తొమ్మిది మహాత్మా జ్యోతిబా పూలే విద్యాసంస్థలు, ఎనిమిది ఆదర్శ కళాశాలలు, ఐదు సాంఘిక సంక్షేమ కళాశాలలు, రెండు మైనారిటీ కళాశాలలు, ఒక గిరిజన సంక్షేమ కళాశాల, ఒక నివాస కళాశాల ఉన్నాయని పేర్కొన్నారు.

**హాజరుపై కఠిన పర్యవేక్షణ**

విద్యార్థులు, అధ్యాపకుల హాజరును ముఖ గుర్తింపు ఆధారిత హాజరు విధానం ద్వారా తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. హాజరు విషయంలో నిర్లక్ష్యం లేకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**గణితంపై ఆసక్తి పెంచాలి**

విద్యార్థుల్లో గణితంపై ఉన్న భయాన్ని తొలగించి, ఆ సబ్జెక్టుపై ఆసక్తి పెంపొందించేలా బోధన సాగించాలని కలెక్టర్ సూచించారు. రోజువారీ జీవితానికి అన్వయించే ఉదాహరణలను ఉపయోగిస్తూ సులభమైన పద్ధతుల్లో పాఠ్యాంశాలను వివరించాలని అధ్యాపకులకు సూచించారు. బోధన కేవలం పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, ఆసక్తిని పెంచేలా ఉండాలని అన్నారు.

విద్యార్థులు ఉన్నత విద్య వైపు అడుగులు వేసేలా వారికి అవసరమైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కళాశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు ప్రిన్సిపాళ్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జితేందర్ రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మీ 'సేవలకు' ఇంకెన్నాళ్ళు??

**మొదటి పేజీ తరువాయి...**
మారింది. నోటిఫికేషన్ ఇచ్చి దాదాపు 10 నెలలు గడుస్తున్నా ఎంపిక ప్రక్రియ ఎందుకు కొలిక్కి రాలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**10 కేంద్రాలకు నోటిఫికేషన్**

2025 నవంబర్‌లో భూపాలపల్లి జిల్లాలోని ఏడు మండలాల పరిధిలో 10 కొత్త మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో నిరుద్యోగులు, మీ సేవా కేంద్రాలు నిర్వహించాలనే ఆసక్తి ఉన్న పలువురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం అధికారులు పరీక్ష నిర్వహించి, ఇంటర్వ్యూల ప్రక్రియను కూడా చేపట్టారు. అయితే ప్రక్రియ పూర్తయిన తర్వాత కూడా తుది ఎంపిక, కేంద్రాల కేటాయింపుపై ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన వెలువడకపోవడం అభ్యర్థుల్లో అసంతృప్తికి కారణమవుతోంది.

**మెరిట్ ఎక్కడ?**

ఎంపిక ప్రక్రియలో పరీక్ష నిర్వహించినప్పుడు మెరిట్ ఆధారంగా అభ్యర్థులను తదుపరి దశకు ఎంపిక చేయాల్సి ఉండగా..దరఖాస్తు చేసుకున్న అందరినీ ఇంటర్వ్యూలకు పిలవడం పట్ల ఆశావహుల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరీక్ష మార్కులకు ఎంత ప్రాధాన్యం ఇచ్చారు? ఇంటర్వ్యూకు ఎన్ని మార్కులు? తుది ఎంపికకు ఏ నిబంధనలు, ప్రమాణాలు పాటిస్తున్నారు? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

**తెరవెనుక ఏం జరుగుతోంది?**

నోటిఫికేషన్ నుంచి పరీక్ష, ఇంటర్వ్యూల వరకు ప్రక్రియ పూర్తయినా తుది కేటాయింపుల్లో ఎందుకు జాప్యం జరుగుతోంది? పది నెలలుగా ఫైలు ఎందుకు ముందుకు కదలడం లేదు? ఎంపిక ప్రక్రియలో ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా? ఉన్నట్లయితే వాటిని పరిష్కరించడంలో జాప్యం ఎందుకు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు పూర్తి వివరాలను వెల్లడించి అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉంది.

**10 కేంద్రాలకు ఒక్క కేంద్రం కేటాయించడం పట్ల అనుమానం**

అధికారులు ప్రకటించిన పది మీ సేవ కేంద్రాలలో గొల్ల బుద్ధారం మీ సేవను ఒకరికి కేటాయించినట్లు సమాచారం..మరి మిగతా కేంద్రాలను ఎప్పుడూ ప్రకటిస్తారు దరఖాస్తు చేసుకున్న వారు ప్రశ్నిస్తున్నారు..ఎంపిక విధానం పట్ల కూడా అనుమానం వ్యక్తం చేస్తున్నారు..దీనిపై సంబంధిత అధికారులను అడిగిన సరైన సమాధానం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పారదర్శకంగా ఎంపిక చేయాలి**

మీ సేవా కేంద్రాల కేటాయింపులో ఎలాంటి వివాదాలకు తావులేకుండా నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలు, అర్హతలు, పరీక్షలో సాధించిన మెరిట్, నిర్దేశిత ఎంపిక ప్రమాణాల ఆధారంగానే తుది ఎంపిక చేపట్టాలని ఆశావహులు డిమాండ్ చేస్తున్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా, వారి మార్కులు, ఎంపికకు అనుసరించిన విధానాన్ని బహిరంగంగా ప్రకటించాలని కోరుతున్నారు. ఇప్పటికే దాదాపు పది నెలలు గడిచిన నేపథ్యంలో ఇకనైనా ప్రక్రియను త్వరగా పూర్తి చేసి అర్హులైన వారికి కొత్త మీ సేవా కేంద్రాలను కేటాయించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు..

**తహసిల్దార్‌లకు లిస్ట్ పంపించాం సెక్షన్ సూపరిండెంట్**

మీ సేవల కేటాయింపుపై సెక్షన్ సూపరిండెంట్ రామారావు వివరణ కోరగా మీ సేవల గురించి సంబంధిత తహసీల్దార్లకు అర్హుల లిస్ట్ పంపామని వారి నుండి ఇన్ఫర్మేషన్ వచ్చాక ఈవిస్డికి పంపిస్తామన్నారు.

# నిమజ్జనానికి కృత్రిమ బేబీ కుంటలు



**మొదటి పేజీ తరువాయి...**
పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కృత్రిమ కుంటల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో పారిశుధ్యం, విద్యుత్, లైటింగ్, తాగునీరు, భద్రత తదితర ఏర్పాట్లను పూర్తిస్థాయిలో చేపట్టాలని ఆదేశించారు.చిన్న, మధ్యతరహా వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం మండపాల నిర్వాహకులు, ప్రజలు తమకు సమీపంలోని కృత్రిమ బేబీ కుంటలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు. జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రదేశాలను వినియోగించుకుని సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కృత్రిమ బేబీ కుంటలను వినియోగించడం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. జిల్లాలోని ఇతర మున్సిపాలిటీల్లోనూ చిన్న, మధ్యతరహా వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో స్టేషన్ రోడ్‌లోని చర్చి సమీపంలో కృత్రిమ బేబీ కుంటను ఏర్పాటు చేశారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కార్యాలయం వద్ద, బీసీ హాస్టల్ వెనుక ఉన్న మూడో వార్డు పార్కులో, 8వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీ పార్కులో కృత్రిమ బేబీ కుంటలను ఏర్పాటు చేశారు. భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్ తండాలోనూ కృత్రిమ బేబీ కుంటను ఏర్పాటు చేశారు.

జిల్లా కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని,మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్రతి మారుమూల ప్రాంతానికీ మెరుగైన

# కమ్యూనికేషన్ సౌకర్యాలు

**నల్లమల్లతో పాటు జిల్లాలో కమ్యూనికేషన్ సౌకర్యాల విస్తరణకు చర్యలు**

**నల్లమల్ల అటవీ ప్రాంతం, కలెక్టరేట్‌తో పాటు మారుమూల ప్రాంతాల్లో 4జీ సాచ్యురేషన్ మోడ్స్ ఏర్పాటు చేయాలి**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్ , అక్షిత ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని నల్లమల్ల అటవీ ప్రాంతంతో పాటు కలెక్టరేట్, మారుమూల ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ 4జీ కమ్యూనికేషన్ సాచ్యురేషన్ మోడ్స్ ఏర్పాటు చేసి మెరుగైన నెట్‌వర్క్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ బీఎస్ఎన్ఎల్ అధికారులను ఆదేశించారు.

శుక్రవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో



అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్రతో కలిసి బీఎస్ఎన్ఎల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లాలో సెల్‌ఫోన్ టవర్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించి ప్రజలకు మెరుగైన నెట్‌వర్క్ సేవలు అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటు, భూసేకరణ, అనుమతులు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు.

ముఖ్యంగా నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న కమ్యూనికేషన్ టవర్ల వల్ల వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అటవీశాఖ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ టవర్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు.

అదేవిధంగా జిల్లాలోని వివిధ మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న చెంచు గిరిజన ప్రజలకు మెరుగైన కమ్యూనికేషన్ నెట్‌వర్క్ సేవలు అందేలా అవసరమైన చోట్ల బీఎస్ఎన్ఎల్ టవర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యాల ద్వారా ప్రభుత్వ సేవలు, అత్యవసర సమాచారం, డిజిటల్ సేవలు ప్రజలకు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

టవర్ల ఏర్పాటుకు అవసరమైన భూమి, అనుమతుల విషయంలో అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు బీఎస్ఎన్ఎల్ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యాలు కల్పించే దిశగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ సమావేశంలో బిఎస్ఎన్ఎల్ అధికారులు వాసు మరికంటి, సుధీర్, సురేష్ నరసయ్య, కలెక్టరేట్ విభాగం సూపరిండెంట్ శోభ తదితరులు పాల్గొన్నారు.

## సెమీకండక్టర్ పరిశోధనకు

# ఐఐటీ హైదరాబాద్--కేన్స్ సెమికాన్ భాగస్వామ్యం

**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** సెమీకండక్టర్ రంగంలో పరిశోధన, ప్రతిభాభివృద్ధి, పరిశ్రమ--విద్యాసంస్థల సహకారాన్ని బలోపేతం చేసేందుకు ఐఐటీ హైదరాబాద్, కేన్స్ సెమికాన్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. న్యూఢిల్లీలోని యశోభూమిలో శుక్రవారం జరిగిన సెమీకాన్ ఇండియా--2026 సందర్భంగా ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఐఐటీ హైదరాబాద్‌లోని వాధ్వాని ఇన్నోవేషన్ నెట్‌వర్క్ అత్యుత్తమ పరిశోధనా కేంద్రం ద్వారా ఈ భాగస్వామ్యం కొనసాగనుంది. ఒప్పందంలో భాగంగా సెమీకండక్టర్, ప్యాకేజింగ్ సాంకేతికతలపై సంయుక్త పరిశోధన, సాంకేతిక ప్రచురణలు, అధ్యాపకులు--పరిశోధకుల పరస్పర



మార్పిడి, విద్యార్థులకు పరిశ్రమలో శిక్షణ, ప్రాజెక్టు అవకాశాలు కల్పించనున్నారు. సంయుక్త సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పరిశోధన ఫలితాలను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఐఐటీ హైదరాబాద్ సంచాలకుడు ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి మాట్లాడుతూ, దేశంలో స్వయం సమృద్ధి కలిగిన సెమీకండక్టర్ రంగ అభివృద్ధికి పరిశ్రమ--విద్యాసంస్థల భాగస్వామ్యం కీలకమన్నారు. కేన్స్ సెమికాన్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రఘు పనికర్ మాట్లాడుతూ, పరిశోధన, పరిశ్రమ అనుభవం, ప్రతిభాభివృద్ధికి ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని తెలిపారు.

ఈ అవగాహన ఒప్పందం రెండేళ్లపాటు అమల్లో ఉండనుంది.

## పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా మార్చడం హర్షణీయం

**మంత్రి జూపల్లి కృష్ణారావు కు కృతజ్ఞతలు**

**మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ**

**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని పెద్దకొత్తపల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ అన్నారు. పెద్దకొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా మార్చడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ నిర్ణయంతో మండలంతో పాటు పరిసర ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందుబాటులోకి



వస్తాయన్నారు. పెద్దకొత్తపల్లి పాఠశాలను పబ్లిక్ స్కూల్‌గా మార్చేందుకు కృషి చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు కు మండల ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ ఆదేర్ల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల్లో పిల్లలను చదివించేందుకు పేద, మధ్యతరగతి కుటుంబాలు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ కు దీటుగా అభివృద్ధి చేయడం వల్ల ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ దండు చంద్రయ్య, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బ్యాగరి మల్లేష్, మాజీ ఎంపీటీసీలు కన్ రెడ్డి అశోక్ రెడ్డి, శశికళ శివశంకర్, వార్డు మెంబర్ సదగొండ పాపయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అవగారి లక్ష్మయ్య, యువ నాయకులు నాగరాజు, బాల నారాయణ, ఉప్పరి శంకర్, రామకృష్ణ, ఎదరపల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాలపై నిజాలు ప్రజల ముందుకు తెస్తాం

**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ...**



**పెద్దపెల్లి, అక్షిత ప్రతినిధి:** తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూ వ్యవహారాలు, ప్రజా ధనం దుర్వినియోగం, అధికార దుర్వినియోగానికి సంబంధించిన అంశాలపై వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావడమే తమ లక్ష్యమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. మల్లు రవి ఆదేశాల మేరకు ఎంపీలు, ఎమ్మెల్సీలతో కలిసి ఈ కార్యక్రమానికి బయలుదేరామని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజలు, ముఖ్యంగా యువత నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఎన్నో త్యాగాలు చేశారని, వారి ఆశయాలకు అనుగుణంగా పాలన సాగాల్సిన అవసరం ఉందన్నారు. గత పదేళ్ల పాలనలో భూ వ్యవహారాలు, ప్రభుత్వ వనరుల వినియోగం, ఉద్యోగాల కల్పన వంటి అంశాలపై ప్రజల్లో అనేక ప్రశ్నలు ఉన్నాయని వంశీకృష్ణ పేర్కొన్నారు. ముఖ్యంగా యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల విషయంలో గత ప్రభుత్వ పనితీరుపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సొమ్ము, భూములు, ప్రభుత్వ వనరులకు సంబంధించిన ఆరోపణలపై నిజానిజాలు వెలుగులోకి రావాలి. తెలంగాణ ప్రజలకు పూర్తి వాస్తవాలను తెలియజేస్తాం. ప్రజల ప్రయోజనాల కోసం మా పోరాటం కొనసాగుతుంది.

## కొంపల్లి ఓల్డ్ ఏజ్ హోమ్ లో ఘనంగా మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి జన్మదిన వేడుకలు




**వికారాబాద్, అక్షిత బ్యూరో:** మాజీ ఎంపీ, ప్రజా నాయకుడు గడ్డం రంజిత్ రెడ్డి వీరాభిమాని మరియు కోటిపల్లి మండల యువ నాయకుడు తాండ్ర ప్రవీణ్ ఆధ్వర్యంలో కొంపల్లి ఓల్డ్ ఏజ్ హోమ్ రంజిత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన అభిమానులు కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాండ్ర ప్రవీణ్ మాట్లాడుతూ... పేద ప్రజల కోసం రాజకీయాలకు అతీతంగా పనిచేసి ఎంతోమంది జీవితాల్లో వెలుగు నింపిన ప్రియతమ నాయకుడు గడ్డం రంజిత్ రెడ్డి జన్మదినాన్ని ఇలా ఓల్డ్ ఏజ్ హోమ్ లో ఆకలితో ఉన్న అనాథల మధ్య జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది అని తెలిపారు. ఒక్క పూటైన వీరి ఆకలి తీర్చినందుకు గర్వంగా ఉంది అని అన్నారు. ప్రతి ఏడాది రంజిత్ రెడ్డి జన్మదినం సందర్భంగా కొంపల్లి ఓల్డ్ ఏజ్ హోమ్ లోనే ఆయన జన్మదిన వేడుకలు నిర్వహించడం జరుగుతుందని, భవిష్యత్తులో కూడా ఇక్కడే నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలోపాల్గొన్న ఒకటవ వార్డు కౌన్సిలర్ అనంతరెడ్డి, మాజీ కౌన్సిలర్ రాజమల్లు, యూత్ కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు.

## భీరం లక్ష్మారెడ్డి భౌతికకాయానికి మంత్రి జూపల్లి నివాళి



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** కొల్లాపూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి భీరం లక్ష్మారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే కొల్లాపూర్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్నారు. భీరం లక్ష్మారెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి ని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. లక్ష్మారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన మరణానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 30లోగా బీఆర్ఏఓయూ ప్రవేశాలకు దరఖాస్తు



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** విద్యను అందరికీ చేరువ చేయడంతోపాటు విద్యార్థుల్లో నైపుణ్యాలు, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బీఆర్ఏఓయూ) ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులు, విద్యా విధానాలను అమలు చేస్తోందని ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ బి. ధర్మ నాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రంలో కౌన్సిలర్ల సమావేశం నిర్వహించి కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

2026 విద్యా సంవత్సరానికి యూజీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని, అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో విద్యార్థులు తమకు అనుకూలమైన సమయంలో, సొంత వేగంతో విద్యను అభ్యసించే అవకాశం ఉందన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా నూతన కోర్సులను రూపొందిస్తున్నామని తెలిపారు. యూజీ, పీజీతోపాటు డిప్లొమా, సర్టిఫికెట్, నైపుణ్యాధారిత కోర్సులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సాంకేతికతను వినియోగించి గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉన్నత విద్యను మరింత చేరువ చేస్తున్నామన్నారు.

**మహిళలకు వ్యాపార నైపుణ్య శిక్షణ**

మహిళా విద్యార్థుల్లో వ్యాపార ఆలోచనలను ప్రోత్సహించి, వారిని భవిష్యత్ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు బీఆర్ఏఓయూ--డబ్ల్యూ హబ్ (ఔజు ఎఖదీ) సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ధర్మ నాయక్ తెలిపారు. వ్యాపారాభివృద్ధి, ఆవిష్కరణలు, నైపుణ్య శిక్షణ, మార్గదర్శకత్వాన్ని అందించనున్నట్లు వివరించారు.

విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టీసీఎస్, ఐకాన్, రామానంద తీర్థ ఇన్‌స్టిట్యూట్, రాశి, వి-హబ్ తదితర సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. ప్రతి విద్యా సంవత్సరంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి బీఆర్ఏఓయూలో అత్యధికంగా ప్రవేశాలు నమోదవుతున్నాయని, ఈ ఏడాది కూడా జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు.

కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్. రత్నమంజుల, అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ జె. చిన్నబాబు, సహాయకులు ఆంజనేయులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## గుర్రపు డెక్క ఆకులు తొలగించే పనులు ప్రారంభం

**వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి**



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో బండరావిరాలనుండి పెద్ద కాపర్తి వరకు పిలాయి పల్లి కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్క ఆకును దివిస్ లేబరేటరీ యాజమాన్యం సౌజన్యంతో సిఎస్ఆర్ నిధులనుండి 20 లక్షల వ్యయంతో తొలగించే పనులు ఇరిగేషన్ ఈఈ రాధాకృష్ణ, డిఈ కృష్ణారెడ్డి లతో కలిసి చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి బండ రావిరాల వద్ద పనులను శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. చౌటుప్పల మండల రైతులు కాలువలో గుర్రపు డెక్క పూర్తిగా పేరుకుపోవడంతో నీళ్లు రాక ఇబ్బంది పడుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో దివిస్ యాజమాన్యంతో మాట్లాడి 20 లక్షల రూపాయలు సిఎస్ఆర్ నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి, దివిస్ యాజమాన్యానికి రైతులందరూ సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు భీమిడి ప్రదీప్ జీ, పోచంపల్లి సింగిల్ విండో చైర్మను పాక మల్లేష్ యాదవ్, జూలూరు సింగిల్ విండో చైర్మను కళ్లెం రాఘవరెడ్డి, సింగల్ విండో వైస్ చైర్మన చెన్నగొని అంజయ్య గౌడ్, చౌటుప్పల్ , పోచంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోయ దేవేందర్, ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, సర్పంచులు చిన్న కొండూరు తీగుళ్ల చంద్రయ్య, పోచంపల్లి సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కాసుల అంజయ్య గౌడ్, ఫిలాయిపల్లి సర్పంచ్ పెరుమాండ్ల మహాలక్ష్మి దానయ్య, మాజీ ఎంపీటీసీ బద్దం కొండల్ రెడ్డి, జిల్లా నాయకులు నల్ల నరేందర్ రెడ్డి, ఢిల్లీ శేఖర్ రెడ్డి,చేవెళ్లి కృష్ణ, సంతు,ఫకీరు యాద్ రెడ్డి,దివిస్ అధికారి గోపి,చౌటుప్పల్ పోచంపల్లి మండలాల రైతులు పాల్గొన్నారు.

## మియాపూర్ లో నైలా అపార్ట్మెంట్స్ వాసుల ఆధ్వర్యంలో వినాయక పూజా కార్యక్రమాలు..

**ముఖ్య అతిథిగా హాజరైన పీ ఎ సి చైర్మన్ శేరిలింగంపల్లి ఎం ఎల్ ఏ అరెకపూడి గాంధీ ..**



**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** మియాపూర్ లో నైలా అపార్ట్మెంట్స్ వాసుల ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక పూజా కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎం ఎల్ ఏ, పి ఎ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ , ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డి ఎస్ ఆర్ కె ప్రసాద్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. నైలా అపార్ట్మెంట్ సభ్యులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనిన అతిథిలను శాలువాలతో సత్కరించారు.

## చలో కొడంగల్ పంచ జన్య సంకల్ప సభ విజయవంతం చేయండి

**పంచ జన్య సంకల్ప సభ వాల్ పోస్టర్ విడుదల**

**తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి బేగరి రాజు**

**టిఆర్ఎస్ పార్టీ ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షులు శివ శంకర్ ప్రజాపతి**




**రంగా రెడ్డి అక్షిత బ్యూరో :** తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు పంచ జన్య వాల్ పోస్టర్ విడుదల చేశారు . ఆదివారం 20వ తేదీన కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండల కేంద్రంలో కాలేజ్ గ్రౌండ్ లో పంచ జన్య సంకల్ప సభ విజయవంతం చేయాలని టిఆర్ఎస్ పార్టీ ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్ ప్రజాపతి, టీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి బేగరి రాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచ జన్య సంకల్ప సభ ఉద్దేశం రాష్ట్రంలో అందరు సామాజికంగా అందరూ సమానంగా ఉండాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధికారంలోకి వస్తే పంచ జన్య ఉచిత విద్య ఉచిత వైద్యం ఉపాధి వ్యవసాయం సామాజిక న్యాయం సాధ్యమైతుందని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కవితమ్మ నాయకత్వంలో రాష్ట్రంలో పార్టీ బలోపేతం అవుతుందని రానున్న ప్రభుత్వం టిఆర్ఎస్ ప్రభుత్వం అని వారు అన్నారు ఈ సభకు చేవెళ్ల నియోజకవర్గం నుండి అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం సహాయ కార్యదర్శి ఏనుగుల సంజీవరెడ్డి, టిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు ఎండి అన్వర్ ఖాన్, టిఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మున్సిపల్ కోశాధికారి షేక్ మొహమ్మద్ నూర్ భాయ్, టిఆర్ఎస్ పార్టీ మైనబాత్ మండల ప్రధాన కార్యదర్శి బొక్క సురేందర్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు మద్యపాక శ్రీకాంత్ సాగర్, సయ్యద్ యాహియ,తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ వారోత్సవాల ముగింపు

**భూమి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన గట్టు గోపాలకృష్ణయ్య**

**సిపిఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ**



**నడిగూడెం, అక్షిత న్యూస్:** తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం రోజు కరివిరాల గ్రామంలో తెలంగాణ ల పోరాటం యోధుడు కామ్రేడ్ గట్టు గోపాలకృష్ణయ్య స్తూపం వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఎర్రజెండా ఎగరవేసి జోహార్లు అర్పించారు ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విజ్ఞప్తి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం ఈరోజుచితంగా పోరాడిన గట్టు గోపాల కృష్ణయ్య ప్రాణాలు అర్పించారనిఅన్నారు ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కోరుట్ల శ్రీనివాస్ ఎస్కే మస్తాన్ పుచ్చ అంజయ్య గార్లపాటి వెంక రెడ్డి సర్దార్ హుస్సేన్ రణబోతు సతీష్ రెడ్డి,శాఖ కార్యదర్శి కేస గాని భద్రయ్య,మిడిదొడ్డి నాగయ్య, మర్రిపల్లిపాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ గణనాథుని దర్శనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఆహ్వానం



**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గం లో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన బాలాపూర్ గణేష్ ఉత్సవాలకు విచ్చేసి స్వామివారిని దర్శించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి బాలాపూర్ గణేష్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి , మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కమిటి అధ్యక్షులు కళ్ళెం నిరంజన్ రెడ్డి, కమిటి సభ్యులు సంరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టేకుల శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హమారా ప్రసాద్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

**నెక్కొండ సీఐ ఫణిధర్‌కు దళిత, ప్రజా సంఘాల వినతి**

**రాజ్యాంగ పునాదులపైనే దేశ పాలన: యాకయ్య మాదిగ**

**అంబేద్కర్‌ను కించపరిస్తే దళిత లోకం చూస్తూ ఊరుకోదు**

**నెక్కొండలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం**



**నర్సంపేట అక్షిత ప్రతినిధి :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను ఉద్దేశించి 'కల్పిత నాయకుడు' పేరిట పుస్తకాన్ని ఆవిష్కరించిన హమారా ప్రసాద్‌ను తక్షణమే అరెస్టు చేయాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని, దళితులను అవమానించిన సదరు వ్యక్తిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని కోరుతూ శుక్రవారం నెక్కొండ సీఐ ఫణిధర్‌కు దళిత, ప్రజా, అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు హమారా ప్రసాద్ చర్యలకు నిరసనగా నెక్కొండలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు.



ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్(టీఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదునూరి యాకయ్య మాదిగ మాట్లాడుతూ.. భారతదేశంలో నేడు పాలన, ప్రజాస్వామ్య వ్యవస్థ సజావుగా సాగుతుందంటే దానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే ప్రధాన కారణమన్నారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా కోట్లాది మంది భారతీయులకు స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం కల్పిస్తూ దేశాన్ని ఐకమత్యంగా ముందుకు నడిపిస్తున్న అత్యున్నత గ్రంథం రాజ్యాంగం అని స్పష్టం చేశారు. దేశంలోని చట్టాలు, ప్రభుత్వ వ్యవస్థలన్నీ రాజ్యాంగ విలువల ఆధారంగానే మనుగడ సాగిస్తున్నాయని గుర్తుచేశారు. అటువంటి పవిత్రమైన రాజ్యాంగాన్ని, దాన్ని రచించిన మహనీయుడిని అవమానించడం దారుణమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతో జీవిస్తూ, ఆ రాజ్యాంగ నిర్మాతనే కించపరచడమంటే యావత్ భారత ప్రజలను, ప్రజాస్వామ్యాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినట్లేనని మండిపడ్డారు. హమారా ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేయడం ద్వారా దళిత, గిరిజన, అంబేద్కర్ వాదుల మనోభావాలను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఇకముందు ఎంతటి వారైనా అంబేద్కర్‌ను లేదా రాజ్యాంగాన్ని అవమానించేలా ప్రవర్తిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

**పాల్గొన్న నాయకులు:**

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు మాంకాల యాదగిరి, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈదునూరి మహేష్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఈదునూరి వెంకన్న, సీనియర్ నాయకులు కొంగర సూర్యారావు, అంబేద్కర్ సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు, నాయకులు ఈదునూరి ప్రభాకర్, నెక్కొండ మండల ఎమ్మార్పీఎస్(టీఎస్) అధ్యక్షులు మంద సురేష్, దళిత కవి మందుల పరమాత్మ, సీనియర్ నాయకులు శ్రావణ్ కుమార్, అంబేద్కర్ సంఘం పట్టణ అధ్యక్షులు ఈదునూరి శివాజీ, తదితర దళిత, ప్రజాసంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## నాగుపాము కాటుతో మహిళ మృతి...





**సిద్దిపేట, అక్షిత ప్రతినిధి:** నాగుపాము కాటుకు గురై ఓ మహిళ మృతి చెందిన విషాద ఘటన నంగునూరు మండలం బద్దిపడగలో చోటు చేసుకుంది. బద్దిపడగ గ్రామానికి చెందిన పసుపుల సుశీల (52) శుక్రవారం ఉదయం సుమారు ఏడు గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాత్‌రూంలోకి వెళ్లింది. అప్పటికే అక్కడ ఉన్న నాగుపాము సుశీలను కాటువేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పాము కాటుకు గురైన సుశీల తీవ్ర అస్వస్థతకు గురికావటంతో కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ పరిస్థితి విషమించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో బద్దిపడగ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన పసుపుల సుశీలకు భర్త యాదయ్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న సుశీల మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబానికి సుశీల మృతి తీరని లోటుగా మారింది. పాము కాటుకు గురికాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఇళ్ల పరిసరాలు, మరుగుదొడ్లు, బాత్‌రూంలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చీకటి ప్రదేశాల్లోకి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని గ్రామ సర్పంచి మంద లక్ష్మి రాజు సూచించారు.

## ఉద్యోగ అవకాశాలపై స్పష్టమైన హామీ ఇవ్వాలి

**గజ్వేల్ పాలిటెక్నిక్ విద్యార్థుల ర్యాలీ**




**గజ్వేల్ అక్షిత ప్రతినిధి:** జీవో 97పై ఆందోళన వ్యక్తం చేస్తూ గజ్వేల్‌లోని గవర్నమెంట్ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ (జిఎంఆర్ పి) విద్యార్థులు కళాశాల నుంచి గజ్వేల్ పట్టణంలోని రహదారి వరకు భారీగా ర్యాలీ నిర్వహించినారు. అనంతరం విద్యార్థులు వారి సమస్యలను ప్రజలతో మాట్లాడుతూ..జీవో 97 అమలుతో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ భవిష్యత్తుపై స్పష్టత అవసరమని విద్యార్థులు పేర్కొన్నారు. ముఖ్యంగా రాబోయే 2027 బ్యాచ్‌లు మరియు తదుపరి బ్యాచ్‌లకు విద్యా, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై ప్రభావం ఉంటుందేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఏసేట్టు అనుమతులు, ఎన్ బిఏ గుర్తింపు, ఇతర విద్యా ప్రమాణాలు, డిప్లొమా సర్టిఫికెట్ విలువ వంటి అంశాలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.మధ్యంతర పరీక్షలను వాయిదా వేయాలని విద్యార్థులు సెప్టెంబర్ 17న కళాశాల యాజమాన్యానికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.జీవో 97పై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వడంతో పాటు, పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు, విద్యా గుర్తింపులు, ఉన్నత విద్య మరియు ఉద్యోగ అవకాశాలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని జిఎంఆర్ పి విద్యార్థులు డిమాండ్ చేశారు.

## ఆత్మ ఆధ్వర్యంలో నానో ఎరువుల వాడకంపై అవగాహన

**బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్**



**అక్షిత బ్యూరో, అదిలాబాద్:** అదిలాబాద్ జిల్లా బోథ్, సొనాల మండలాల్లోని డెమ్మి, గన్ పూర్ గ్రామాల్లో శుక్రవారం ఆత్మ ఆధ్వర్యంలో నానో ఎరువుల వాడకంపై అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం, ప్రధాన పంటల సాగు యాజమాన్యం, హెచ్‌టీ కాటన్ సాగు ప్రతికూల ప్రభావాలు, నానో యూరియా, నానో డీఏపీ వినియోగం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఏ ఆర్ ఎస్ శాస్త్రవేత్త డా. రఘువీర్, ఏడీఏ శ్రీధర్ స్వామిలు మాట్లాడుతూ నానో ఎరువులను వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు వినియోగించాలని, శాస్త్రీయ పద్ధతులతో సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ మాట్లాడుతూ రైతులు సేంద్రియ పద్ధతులతో పాటు శాస్త్రీయ, ఆధునిక సాగు విధానాలను అలవర్చుకోవాలని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతుల వద్దకే వచ్చి అవగాహన కల్పిస్తున్నందున, రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రధాన పంటలతో పాటు ఉద్యాన పంటల సాగుపై కూడా దృష్టి సారించాలని సూచించారు.

**డెమ్మి గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి...**

అనంతరం గ్రామ ప్రజలు సరైన రహదారి సౌకర్యం, అంగన్‌వాడీ పాఠశాల ఏర్పాటు, అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని కోరారు. దీనిపై గొర్ల రాజు యాదవ్ స్పందించి ఈ సమస్యలను ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గజేందర్ సహకారంతో సంబంధిత అధికారులతో మాట్లాడి రహదారి, అంగన్‌వాడీ పాఠశాల మంజూరుకు, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏవో రవితేజ, ఏఈఓ ఎస్.కె. వాహిద్, ఆత్మ డైరెక్టర్లు ఎస్.కె. అబుద్, రహీముద్దీన్, గ్రామ పెద్ద దారం సింగ్ నాయక్, గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ కేసులతో వేధిస్తున్నారు

**బాధితుల ఆవేదన**




**ఖమ్మం/అక్షిత బ్యూరో :** అక్రమ కేసులతో కూసుమంచి ఎస్ఐ వేధిస్తున్నారని కూసుమంచి మండలం కేసవాపురం గ్రామానికి చెందిన మందపల్లి శ్రీనివాసరావు రజనీ మందపల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు.ఖమ్మం లోని ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు వేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన పోటు ప్రదీప్ పోటు తిరుమలరావు అనే ఇద్దరు వ్యక్తులు రాళ్ళు కర్రలతో తమ భూమిలోకి వచ్చి గొడవ చేసారని వారిపై పోలీసులకు పిర్యాదు పట్టించుకోలేదని తెలిపారు. పైగా తామే దాడి చేశామంటూ అసత్య ఆరోపణలు చేస్తూ ప్రదీప్ తిరుమలరావు మాపై కూసుమంచి పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు.

ఈ ఘటనపై తాము ఉన్నతాధికారులైన డీజీపీకి 03.11.2025 న ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.ఈ విషయం తెలిసి కక్ష సాధింపు చర్యగా కూసుమంచి ఎస్సై తమపై అక్రమ సెక్షన్లతో కేసు నమోదు చేసారని ఇటీవల కోర్టు నుంచి ఈ కేసు గురించి ఛార్జిషీట్ వచ్చిందంటూ తమను స్టేషన్ పిలిపించారని ఆవేదన వ్యక్తం చేశారు.

తహశిల్దార్ సర్వేయర్ గ్రామానికి వచ్చి విచారణ చేసి తమకు వ్యతిరేకంగా ప్రదీప్ కు అనుకూలంగా రిపోర్ట్ ఇచ్చారని ఆరోపించారు. అబద్ధపు సంఖ్యలతో ఎస్సారెస్పీ కాలువ ఉన్న భూమిని మట్టి రోడ్డుగా మాత్రమే చూపుతూ అధికారులు తప్పుడు నివేదికలు తయారు చేశారనీ ఆరోపించారు.

మాకు జరిగిన ఈ అన్యాయంపై సమగ్ర విచారణ జరిపి అక్రమ కేసులను తొలగించి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

# అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**అక్షిత బ్యూరో, మంచిర్యాల :** జిల్లాలో జాతీయ రహదారి 63 రహదారి నిర్మాణంలో అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఆర్.డి.ఓ. శ్రీనివాస్ రావు తో కలిసి జాతీయ రహదారి విస్తరణలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 63 విస్తరణలో అవార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పింఛన్లపై వెరిఫికేషన్ సర్వే



**నడిగూడెం, అక్షిత న్యూస్:** మండలం లోని రామాపురం గ్రామం లో లబ్ధిదారుల ఇళ్లకు ఎమ్ పి డి ఓ మల్సూర్ నాయక్ వెళ్లి క్షేత్రస్థాయి తనిఖీలు చేసారు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అర్హతలను పరిశీలించి, లబ్ధిదారుల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు.సర్వే సమయంలో లబ్ధిదారులు తమ ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని, అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అధికారులు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలను పరిశీలించి, అర్హతలను నిర్ధారించిన అనంతరం వివరాలను పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూతుక్కూరి వెంకట్ రెడ్డి , ఉప సర్పంచ్ మందుల నాగార్జున,పంచాయతీ కార్యదర్శి నామా నరసింహారావు , లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు..



**రామచంద్రపురం అక్షిత ప్రతినిధి:** భారత దేశ ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా, నరేంద్ర మోడీ 25 సంవత్సరాల ప్రజాసేవ సంస్మరించుకుంటూ సంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ కంజర్ల కృష్ణమూర్తి కంజర్ల కృష్ణమూర్తి చారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ముఖ్య అతిథిగా, భారతి నగర్ డివిజన్ జి హెచ్ ఎం సి మహిళా కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమం ఎల్ ఐ జటి భారతి నగర్ కాలనీలో నిర్వహించడం జరిగింది, ఈకార్యక్రమంలో నంద రెడ్డి, కంజర్ల సునంద, అనిత ,గీత, మధు,సాయి వెంకట హర్ష, రాజేందర్ చారి తదితర బిజెపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు, ఈ సందర్భంగా మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాల ప్రజాసేవను గుర్తుచేసుకొని, నరేంద్ర మోడీ మరెన్నో సంవత్సరాలు మన దేశ ప్రజలకు సేవలు అందించాలని, మోడీ ఆయురారోగ్యాలతో జీవించి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించాలని కోరుకున్నారు.

# నిర్విరామంగా కొనసాగుతున్న సుంకిరెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరం సేవలు..

## నాలుగు రోజులుగా “121 మంది కంటి శుక్లాల పేషెంట్లకు విజయవంతంగా” ఆపరేషన్లు పూర్తి..

## మొత్తంగా 180 మంది పేషెంట్లు కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక..



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో,శంకరా నేత్రాలయ,చెన్నై వైద్య నిపుణులచే కడ్తాల్ ఎంబీఏ గార్డెన్లో నిర్వహిస్తున్న సుంకిరెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరం ఎనిమిదవ రోజుకు చేరుకుంది.గత ఎనిమిది రోజులుగా కొనసాగుతున్న ఈ శిబిరంలో వేలాది మంది ప్రజలకు ఉచిత కంటి వైద్య సేవలు అందించారు. కంటి పరీక్షల ప్రక్రియ ఇప్పటికే ముగియగా, ప్రస్తుతం కంటి శుక్లాల సమస్య ఉన్న పేషెంట్లకు ఉచిత ఆపరేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది.ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతు నాలుగు రోజులుగా కొనసాగుతున్న కంటి శుక్లాల ఆపర్షన్ల ప్రక్రియలో భాగంగా.నేడు ఆపరేషన్లకు హాజరైన మరో 34 మంది పేషెంట్లకు విజయవంతంగా కంటి శుక్లాల ఆపరేషన్లు పూర్తయ్యాయని, శుక్రవారం వరకు121 మంది పేషెంట్లకు విజయవంతంగా ఆపరేషన్లు పూర్తి అయ్యాయని,అదేవిధంగా,వైద్యుల పరిశీలన అనంతరం మరో 13 మంది పేషెంట్లను ఆపరేషన్ల కోసం ఈరోజు ఎంపిక చేయడం జరిగిందని, దీంతో ఈ శిబిరంలో ఇప్పటివరకు మొత్తం 180 మంది కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపికయ్యారని, సెప్టెంబర్ 15 నుంచి కొనసాగుతున్న కంటి శుక్లాల ఆపరేషన్ల ప్రక్రియ సెప్టెంబర్ 19తో ముగియనుంది,కడ్తాల్‌లో గత ఎనిమిది రోజులుగా కొనసాగుతున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా వేలాది మంది ప్రజలకు ఉచిత కంటి వైద్య సేవలు అందాయని, కంటి పరీక్షల ప్రక్రియ పూర్తయినప్పటికీ, కంటి శుక్లాల సమస్య ఉన్న పేషెంట్లకు ఉచిత ఆపరేషన్ల ప్రక్రియ కొనసాగిస్తున్నాం,ఆర్థిక ఇబ్బందుల కారణంగా కంటి శుక్లాల ఆపరేషన్లు చేయించుకోలేని పేద కుటుంబాలకు ఈ ఉచిత వైద్య సేవలు ఎంతో ఉపయోగపడుతున్నాయి,



ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ,ఆశీర్వాదాలు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి మరింత సేవ చేయడానికి స్ఫూర్తినిస్తున్నాయి.రేపటితో ఆపరేషన్ల ప్రక్రియ ముగియనున్న నేపథ్యంలో ఎంపికైన పేషెంట్లకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు కొనసాగుతున్నాయి అని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో

ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రఘు,ఎగిరిశెట్టి లింగం రచ్చ శ్రీరాములు,నరేందర్ గౌడ్,చంద్రశేఖర్,శ్రీపతి,శ్రీను,భాస్కర్,ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

# 22-ఏ భూములపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోంది



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** 22-ఏ నిషేధిత భూముల విషయంలో బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిషేధిత జాబితాలోని భూముల విస్తీర్ణాన్ని గణనీయంగా తగ్గించామని ఆయన పేర్కొన్నారు. సంగారెడ్డిలో డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డితో కలిసి శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సత్యం శ్రీరంగం మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి వ్యవస్థను తీసుకొచ్చి 22-ఏ జాబితాలో 22.93 లక్షల ఎకరాలను చేర్చారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విస్తీర్ణాన్ని ఏడు లక్షల ఎకరాలకు తగ్గించామని, ప్రస్తుతం 22-ఏ కింద 3.75 లక్షల ఎకరాలు మాత్రమే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే, 22-ఏ నిషేధిత జాబితాపై సెప్టెంబర్‌లో జరిగిన శాసనసభ చర్చల్లో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన గణాంకాలు భిన్నంగా ఉన్నాయి. ఆ చర్చల ప్రకారం 2026 ఆగస్టు 30 నాటికి మొత్తం 1,02,05,250 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయని, అందులో ప్రభుత్వ, ప్రైవేటు తదితర విభాగాల భూములు ఉన్నాయని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22-ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారని సత్యం శ్రీరంగం తెలిపారు. 22-ఏకు సంబంధించిన వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతస్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు, నెల రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు రెవెన్యూ మంత్రి సెప్టెంబర్ 18న శాసనసభలో వెల్లడించారు.

### బీఆర్ఎస్ హయాంలో భూదోపిడీ జరిగిందని ఆరోపణ

తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో ధరణిని అడ్డుపెట్టుకుని అసైన్డ్ భూములను అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని సత్యం శ్రీరంగం ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు అక్రమంగా పట్టాలు సృష్టించి స్వాధీనం చేసుకున్న భూముల వివరాలను వెలుగులోకి తీసుకొస్తామని తెలిపారు. అయితే ఇవి తమ పార్టీ తరఫున చేసిన ఆరోపణలేనని ఆయన పేర్కొన్న అంశాలను అధికారికంగా నిర్ధారించే ఆధారాలను సమావేశంలో వెల్లడించలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తదితర అంశాలపై కూడా ఆయన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. అప్పుల భారం ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందని అన్నారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

### దళితులను అవమానించారని ఆరోపణ

బీఆర్ఎస్ పాలనలో దళితుల పట్ల అవమానకరంగా వ్యవహరించిన సందర్భాలు ఉన్నాయని సత్యం శ్రీరంగం ఆరోపించారు. ఫామ్‌హౌస్ వద్ద నిరసన తెలిపిన దళితులను అవమానించేలా రహదారులను శుద్ధి చేశారని పేర్కొన్నారు. అలాగే శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఘటనలను ఆయన ప్రస్తావించారు.

### అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యమని వెల్లడి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పలు కొత్త విధానాలను అమలు చేస్తోందని సత్యం శ్రీరంగం తెలిపారు. ప్రజా పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో బీజేపీకి లోపాయికారి ఒప్పందం ఉందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ ఆరోపణలేనని స్పష్టం చేస్తూ, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య అవగాహన కారణంగానే బీజేపీకి ఎంపీ స్థానాలు వచ్చాయని ఆయన ఆరోపించారు. విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి తోపాజి అనంత కిషన్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి చేర్యాల ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ గడీల రామ్‌రెడ్డి, సీనియర్ నాయకులు రఘుగౌడ్, మునిపల్లి సత్యనారాయణ, కూన సంతోష్, పట్టణ అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు

# హౌసింగ్ బోర్డు కాలనీ పునరాభివృద్ధి చేపట్టాలి

**పేదలకు ఇందిరమ్మ టవర్స్ నిర్మించాలి**

**అసెంబ్లీలో ఎమ్మెల్యే నాయిని...**

**సానుకూలంగా స్పందించిన హౌసింగ్ శాఖ మంత్రి...**



**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతాల్లో పేదలు, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న గృహ సమస్యలను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలంగాణ శాసనసభలో ప్రస్తావించారు. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలు అందుబాటులో లేకపోవడంతో అనేక మంది పేదలు సొంత ఇల్లు నిర్మించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా హౌసింగ్ బోర్డు కాలనీ సమస్యను ప్రత్యేకంగా ప్రస్తావించిన ఎమ్మెల్యే , వరంగల్--హనుమకొండ నగర ప్రాంతంలో సుమారు 40--50 సంవత్సరాల క్రితం నిర్మించిన హౌసింగ్ బోర్డు కాలనీలోని ఇళ్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. సుమారు వెయ్యి ఇళ్లతో ఉన్న ఈ కాలనీ నగరంలోని కీలక ప్రాంతంలో ఉందని, కాలనీని ఆధునిక అవసరాలకు అనుగుణంగా పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు.

పాత ఇళ్లను రెనోవేషన్ చేయడమా, లేక అవసరమైతే వాటిని తొలగించి ఆధునిక బహుళ అంతస్తుల భవనాలను నిర్మించడమా అనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని ఎమ్మెల్యే కోరారు. ఒకే ప్రాంతంలో ఎక్కువ మంది ప్రజలకు ఇళ్లను అందించే విధంగా టవర్స్ నిర్మాణం చేపడితే స్థల సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు, పాత కాలనీకి కూడా కొత్త రూపు తీసుకురావచ్చని సూచించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని కొంతమంది లబ్ధిదారులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద నోటీసులు జారీ చేసినప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొందరు ఆ మొత్తాన్ని చెల్లించలేకపోయారని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అటువంటి వారికి మరోసారి అవకాశం కల్పించి, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ సౌకర్యాన్ని అందించాలని కోరారు.

ఎమ్మెల్యే సభలో ప్రస్తావించిన హౌసింగ్ సమస్యలపై సంబంధిత శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలోని కార్పొరేషన్లలో నిరుపేదలకు ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, అందులో భాగంగా వరంగల్--హనుమకొండలో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపట్టే అంశాన్ని పరిశీలిస్తామని మంత్రి తెలిపారు.

అలాగే హౌసింగ్ బోర్డు కాలనీకి సంబంధించిన వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అంశాన్ని కూడా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి సభలో సమాధానం ఇచ్చారు.

# గుండ్లపల్లి - పొత్తూరు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం బీజేపీ నిరంతర పోరాటం

**అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే కవ్వపల్లి సత్యనారాయణ**

**ఎన్నికల సమయంలో 100 రోజుల్లో పూర్తి చేస్తామన్న హామీ**



**మానకొండూర్ అక్షిత న్యూస్:** రెండున్నర ఏళ్లుగా దారుణంగా మారిన రోడ్డు పరిస్థితి-రోడ్డు బాగు కోసం బీజేపీ ఆధ్వర్యంలో నిరంతర ఆందోళనలు, నిరసనలు. ఇటీవల నిరసన కార్యక్రమం సందర్భంగా సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించాలని డిమాండ్ చేసిన బీజేపీ మండలాధ్యక్షుడు తిప్పర్తి నికేష్ , సమస్యపై స్పందించి అసెంబ్లీలో మాట్లాడిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వపల్లి సత్యనారాయణ, తక్షణ నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి. మానకొండూర్ నియోజకవర్గ పరిధిలోని గుండ్లపల్లి - పొత్తూరు రెండు వరుసల (టూ-లేన్) రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గత రెండున్నర ఏళ్లుగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో సాగుతున్న పోరాటం ఫలితంగా ఇప్పుడు ఈ అంశం అసెంబ్లీ వేదికగా ప్రధాన చర్చకు వచ్చింది. గత ఎన్నికల సమయంలో గుండ్లపల్లి - పొత్తూరు రోడ్డును కేవలం 100 రోజుల్లోనే పూర్తి చేస్తామని కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు. అయితే, కాలం గడుస్తున్నా పనులు ముందుకు పడకపోవడంతో రోడ్డు పూర్తిగా అధ్వానంగా, గుంతలమయంగా తయారైంది. దీనివల్ల ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**"బీజేపీ ఆధ్వర్యంలో హోరెత్తిన నిరసనలు,"**

ప్రజల పక్షాన నిలిచిన బీజేపీ నాయకులు ఈ సమస్యపై గత రెండున్నర ఏళ్లుగా నిరసనలు, ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తూనే ఉన్నారు. ఇటీవల బీజేపీ మండలాధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో మరోసారి నిరసన కార్యక్రమం చేపట్టి, రోడ్డు దుస్థితిని వెంటనే అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నుడిమాండ్ చేశారు. బీజేపీ శ్రేణుల నిరసనలు, ప్రజల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వ0పల్లి సత్యనారాయణ ఎట్టకేలకు ఈ రోడ్డు సమస్యను శాసనసభలో ప్రస్తావించారు. గుండ్లపల్లి - పొత్తూరు రోడ్డు నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు తిప్పర్తి నికేష్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం బిజెపి ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటానికి ఎమ్మెల్యే దిగివచ్చి సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించడం సంతోషకరమన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కరంగా మారి అస్తవ్యస్తంగా , నరకయాతనగా మారిన గుండ్లపల్లి-పొత్తూర్ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని , ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## బోధనలో ప్రతిభకు గుర్తింపు.. సునీతకు ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు



**లోకేశ్వరం, సెప్టెంబర్ 18 అక్షిత న్యూస్ :** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల కేంద్రం లోని రామకృష్ణ విద్యాశాల (ఎస్ఆర్ఎస్) ఉపాధ్యాయురాలు ఎం. సునీత,ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు. నిర్మల్ జిల్లా ప్రైవేట్ పాఠశాలల ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సునీత,కు పురస్కారం అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ, వారి ప్రతిభను వెలికితీయడంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది. సునీతకు అవార్డు లభించడంపై పాఠశాల ప్రిన్సిపల్ గంగయ్య, కరస్పాండెంట్ పులి రమేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి అభినందించారు...

## ఎస్సారెస్పీ భూములను పరిశీలించిన కలెక్టర్



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** సైదాపూర్ మండలంలోని ఎక్లాస్పూర్ గ్రామంలో ఎస్సారెస్పీకి సంబంధించిన భూములను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దాదాపు నాలుగు సర్వే నంబర్ల పరిధిలో ఉన్న సుమారు 24 ఎకరాల భూమి వివరాలను పరిశీలించిన కలెక్టర్.. భూమి ప్రస్తుత పరిస్థితి, వినియోగం తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సైదాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్‌ను అడిగి భూమికి సంబంధించిన పలు వివరాలను తెలుసుకున్నారు. ఎస్సారెస్పీ భూమి ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉందా, అనే అంశంపై క్షేత్రస్థాయి పరిస్థితులను కలెక్టర్ పర్యవేక్షించారు. భూమికి సంబంధించిన సర్వే నంబర్లు, విస్తీర్ణం, రెవెన్యూ రికార్డుల్లో నమోదైన వివరాలను పరిశీలించి సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్‌తో పాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమప్రిన్సిపాల్-ఉపాధ్యాయునికి ఘనంగా సన్మానం



**చేర్యాల అక్షిత ప్రతినిధి:** చేర్యాల మండలం స్థాయిలో ఉత్తమ ప్రిన్సిపాల్ గా స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ ప్రిన్సిపల్ పోలోజు నరసింహ చారి మరియు ఉత్తమ అధ్యాపకులు గా పోతుల రాజు లకు ఉత్తమ అవార్డులకు ఎంపికైన సందర్భంగా, శుక్రవారం మండల విద్యాధికారి బైరి నరేందర్ వివిధ ఉపాధ్యాయ సంఘాల ఉపాధ్యాయుల, అధ్యాపకులతో కలిసి ముస్తాల మోడల్ స్కూల్ లో ఇరువురిని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, అధ్యాపకులు మాట్లాడుతూ.. చేర్యాల మండలంలో ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల ఉత్తమ ప్రిన్సిపాల్ మరియు ఉత్తమ ఉపాధ్యాయులుగా చేర్యాల నుండి ఎంపిక చేసినందుకు ఎంఈఓ కు కృతజ్ఞతలు తెలిపారు.

# చట్టాలపై అవగాహనతోనే సురక్షిత సమాజం




## సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్

కరీంనగర్ అక్షిత బ్యూరో: జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్. శివకుమార్ అనుమతితో కరీంనగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ (ఆర్ట్స్) 'న్యాయ విజ్ఞాన సదస్సు' ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడుకుంటూనే, పౌర బాధ్యతలను నెరవేర్చాలని వారు సూచించారు. న్యాయం కేవలం ధనవంతులకే కాదని పేదలకు కూడా అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సలహాలు, సహాయం అందిస్తుందని వివరించారు. సదస్సులో పాల్గొన్న ప్యానల్ న్యాయవాదులు పలు అంశాలపై ప్రసంగించారు. మత్తు పదార్థాల సేవనం ఒక సామాజిక రుగ్మత అని న్యాయవాదులు పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాల వల్ల విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని యశ్వంత్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం సరదా కోసం మొదలయ్యే అలవాటు, చివరకు నేరాలకు దారితీస్తుందని తెలిపారు. ఎన్.డి.పి.ఎస్ చట్టంలోని సెక్షన్ల గురించి వివరిస్తూ, మత్తు పదార్థాల రవాణా చేసినా లేదా వినియోగించినా కష్టమని, కఠిన కారాగార శిక్షలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులు అటువంటి అలవాట్లకు దూరంగా ఉంటూ, తమ స్నేహితులను కూడా చైతన్యపరచాలని కోరారు. ప్రస్తుత స్మార్ట్ ఫోన్ యుగంలో ఆన్‌లైన్ నేరాలు పెరిగిపోతున్నాయని న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరగాళ్ళు రకరకాల ఆశలు చూపి బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్నారని, ఓటిపి లు ఎవరికీ చెప్పవద్దని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచితుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా విద్యార్థినులు వ్యక్తిగత ఫోటోలను ఇంటర్నెట్‌లో పెట్టేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఒకరిని కించపరుస్తూ పోస్ట్‌లు పెట్టినా, అసభ్యకర సందేశాలు పంపినా ఐటి చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని వివరించారు. సైబర్ వేధింపులకు గురైతే తక్షణమే '1930' నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మానసిక ఒత్తిడిని జయించడానికి క్రమశిక్షణతో కూడిన జీవనశైలి అవసరమని అన్నారు. ప్రణాళికా బద్ధమైన చదువు, క్రీడలు, మరియు పెద్దల సలహా లు తీసుకుని అద్భుతమైన విజయాలు సాధించ వచ్చని విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. ఉచిత న్యాయసేవల కోసం 15100 టోల్ ఫ్రీ నెంబర్ లో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదు లు ఏ. కిరణ్ కుమార్, పెరుక రంగయ్య పటేల్, చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి ఏ. సత్యనారాయణ, కాలేజీ ఇంచార్జి ప్రిన్సిపాల్ యన్. పద్మ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మౌనిక, షీ టీమ్ కానిస్టేబుల్ ఆకుల స్వప్న లు పాల్గొన్నారు.

## గోసేవతో ఆధ్యాత్మిక సంతృప్తి

### భైంసా గోశాలలో గోమాతకు ప్రత్యేక హారతి.. గోశాల అభివృద్ధికి సహకరిస్తామని హామీ



నిర్మల్ అక్షిత బ్యూరో, సెప్టెంబర్ 18: గోమాత సంరక్షణకు ప్రజల్లో మరింత చైతన్యం కల్పించడంతో పాటు గోసేవలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో భైంసా పట్టణంలోని సాయినగర్ వాసులు గోశాలను సందర్శించారు. ఈ సందర్భంగా గోమాతకు ప్రత్యేక హారతి ఇచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో గోవుకు ఎంతో విశిష్టమైన స్థానం ఉందన్నారు. గోవును పూజించడం, సంరక్షించడం ద్వారా ధార్మిక సంప్రదాయాలను గౌరవించినట్లవుతుందని పేర్కొన్నారు. గోశాలలోని గోవులకు అవసరమైన సంరక్షణ అందించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గోశాల నిర్వహణకు, గోవుల సంరక్షణకు తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తామని సాయినగర్ వాసులు తెలిపారు. గోసేవ పట్ల ఆసక్తి ఉన్న దాతలు, ప్రజలు ముందుకు వచ్చి గోశాల అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో సాయినగర్ వాసులు, భక్తులు పాల్గొని గోమాతకు హారతి సమర్పించారు.

## అనారోగ్య బాధితుడికి ఎల్ఓసి అందజేత



చౌటుప్పల్/ అక్షిత న్యూస్: యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని 18 వార్డుకు చెందిన పి.ఒంప్రకాశ్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా అత్యవసర డయాలెసిస్ నిమిత్తం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన లక్ష రూపాయల ఎల్వోసి చెక్కును శుక్రవారం పురపాలక వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, మున్సిపల్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి , కాంగ్రెస్ నాయకులు కామిశెట్టి భాస్కర్, గుగులోతు శంకర్ నాయక్ ల చేతుల మీదుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితుడికి అందజేశారు.

## గంజి వెంకటేష్‌ను సన్మానించిన బిజెపి నాయకులు



చౌటుప్పల్ /అక్షిత న్యూస్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినం సందర్భంగా సేవ సంకల్ప ఉత్సవ్ లలో భాగంగా జాతీయ చేనేత సహకార సెల్ రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న గంజి వెంకటేష్ ను చౌటుప్పల్ మున్సిపల్ బిజెపి నాయకులు శాలువలతో ఘనంగా సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు కదిరి కల్పన యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు రమణ గోని శంకరయ్య, గుజ్జుల సురేందర్ రెడ్డి,ముత్యాల భూపాల్ రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్ బాబు, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ఉడుగు వెంకటేశం గౌడ్, కాసుల వెంకటేశం గౌడ్,అమృతం దశరథ, వనం ధనంజయ, గోశిక పురుషోత్తం,కదారి ఐలయ్య, బడుగు కృష్ణ, పర్నే శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బూత్ అధ్యక్షులు గోషిక ధనంజయ, గోశిక భావన రుషి,కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రోన్లు, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు ఎందుకు? కాంగ్రెస్‌కు హరీశ్ రావు ప్రశ్న

### సిద్దిపేటకు రావడానికి కాంగ్రెస్ కు భయమెందుకు?

### సిద్దిపేటకు వస్తే కడుపునిండా అన్నం పెడతాం, కంటినిండా నేనే చూపిస్తా

### నా భూముల వివరాలన్నీ ఎలక్షన్ అఫిడవిట్లలోనే ఉన్నాయి



సిద్దిపేట, అక్షిత బ్యూరో: సిద్దిపేటకు కాంగ్రెస్ నేతలు తన భూములను పరిశీలించేందుకు వస్తున్నారంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత టి. హరీశ్ రావు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా భారీగా పోలీసు బందోబస్తు, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, రోప్ పార్టీలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. సిద్దిపేటలో తన భూములను పరిశీలించేందుకు వచ్చే వారు తనకు సమాచారం ఇస్తే తానే అన్ని ఏర్పాట్లు చేస్తానని హరీశ్ రావు అన్నారు. వారికి భోజనం పెట్టి, తన తోటలను దగ్గరుండి చూపిస్తానని పేర్కొన్నారు. డ్రోన్లతో ఫోటోలు తీయడం ఎందుకని ప్రశ్నించిన ఆయన, ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలని, అబద్ధాలు చెప్పొద్దని సూచించారు. తన జీవితం తెరిచిన పుస్తకమని హరీశ్ రావు అన్నారు. తాను సమర్పించిన అన్ని ఎన్నికల అఫిడవిట్లలో భూములు, ఆస్తుల వివరాలను సర్వే నంబర్లతో సహా స్పష్టంగా వెల్లడించామని తెలిపారు. రామంచలో తనకు ఉన్న 13 ఎకరాల భూమికి సంబంధించి లేనిపోని విషయాలను చెబుతున్నారని ఆయన ఆరోపించారు. తాను ఏ విషయాన్నీ దాచలేదని, కొత్తగా బయటపెట్టేది ఏమీ లేదని హరీశ్ రావు అన్నారు. ప్రత్యర్థులపై ఆరోపణలు చేస్తూ, మీ లాగా నేను కబ్జాలు పెట్టలేదు, ప్రజల సొమ్ము దోచుకోలేదు అని వ్యాఖ్యానించారు. సిద్దిపేట ప్రజలు తన పనిని చూసి ఏడు సార్లు గెలిపించారని, తనను దీవించారని హరీశ్ రావు పేర్కొన్నారు. సిద్దిపేట ప్రేమ, ఆప్యాయత, ఆతిథ్యానికి చిరునామా అని, ఇక్కడికి ఎవరొచ్చినా కడుపునిండా అన్నం పెట్టి ప్రేమగా మాట్లాడతామని అన్నారు. భారీ పోలీసు బందోబస్తుతో భయపడుతూ రావాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నేతలకు సూచించారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

### అండర్ -14, అండర్-17 క్రీడల్లో ఎంజేపీటీ మలక్ పేట్,కార్వాన్ విద్యార్థుల విజయకేతనం...

### పీడీలు పి.హేమంత్ కుమార్, ఎం సతీష్ లకు అభినందనల వెల్లువ

### ఏ.జీ.వో కే.వెంకట్రావు

### ఎంజేపీటీ పాఠశాల,కళాశాల ప్రిన్సిపల్ టి.శ్వేత



చౌటుప్పల్/ అక్షిత న్యూస్: విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఏ.జీ.వో కె వెంకటరావు అన్నారు. గోల్కొండ, సైదాబాద్ జోనల్ లెవల్లో జరిగిన అండర్- 14,అండర్- 17 కబడ్డీ,ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడా విభాగాలలో దేశ్ముఖి మలక్పేట,కార్వాన్ మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు హైదరాబాద్ జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించి తమ సత్తా చాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ టి.శ్వేత మాట్లాడుతూ.. విద్యార్థులు అండర్ పోటీలు అండర్-14,అండర్ -17 క్రీడా విభాగాలలో విజయం సాధించి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఇద్దరు, రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ క్రీడలకు ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు. క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్లను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఏజీవో కే. వెంకట్రావు మాట్లాడుతూ.. విద్యార్థులను క్రీడల్లో నిష్ణాతులుగా తయారుచేసిన పాఠశాల పీడీలు ఎం సతీష్, పి. హేమంత్ కుమార్ లను ప్రత్యేకంగా అభినందించారు. జరగబోయే రాష్ట్ర స్థాయి క్రీడల్లో కూడా విద్యార్థులు విజయం సాధించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీ శ్వేత, అధ్యాపక బృందం ఫిజికల్ డైరెక్టర్లను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి. శ్వేత, ఏటీపీ ఏ.రవిశంకర్, బి డబ్ల్యు జోత్స్న, పాఠశాల, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.